క్లుప్తంగా

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

ఏఈఓ సునీల్‌కుమార్



మొయినాబాద్ క్లస్టర్‌లో ఫార్మర్ రిజిస్ట్రీ చేస్తున్న ఏఈఓ సునీల్‌కుమార్

మొయినాబాద్: రైతులు ఫార్మర్ రిజిస్ట్రీని తప్పనిసరిగా చేయించుకోవాలని మొయినాబాద్, కేతిరెడ్డిపల్లి సెక్టార్ల వ్యవసాయ విస్తరణ అధికారులు ఎన్.సునీల్‌కుమార్, కుమార్ తెలిపారు. ఆయా క్లస్టర్లలో బుధవారం వారు ఫార్మర్ రిజిస్ట్రీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ రైతు ఆధార్‌కార్డు, దానికి లింక్ ఉన్న ఫోన్ తీసుకొని వ్యవసాయ అధికారులకు సంప్రదించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు అందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా ఉండాలన్నారు. గురువారం మండల పరిధిలోని చిన్నమంగళారం, తోలుకట్ట గ్రామాల్లో నిర్వహించనున్న కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్: పట్టణంలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో లబ్ధిదారులకు బుధవారం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. వివిధ మండలాలకు చెందిన 34 మంది లబ్ధిదారులకు ఆయన చెక్కులు అందజేసి మాట్లాడుతూ.. అర్హులైన పేద ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా విజయ్‌కుమార్

షాబాద్: కాంగ్రెస్‌తోనే గ్రామాలు, పట్టణాల అభివృద్ధ సాధ్యమని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పానుగంటి సురేందర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని నాగర్‌కుంట గ్రామ పార్టీ యూత్ అధ్యక్షుడిగా పార్వతి విజయ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించినందకు పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని గ్రామస్థాయిలో అభివృద్ధి చేసేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు తొంట కృష్ణయ్య, పార్వతి భాస్కర్, నర్సింలు, శివయ్య, శివరాజ్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

పైపులైన్ లీకేజీ.. మంజీరా నీరు వృథా



జన్వాడ గేట్ వద్ద రోడ్డుపై వృథాగా పోతున్న మంజీరా నీరు

శంకర్‌పల్లి: హైదరాబాద్–శంకర్‌పల్లి ప్రధాన రోడ్డు పక్కన(జన్వాడ గేట్) పైపులైన్ లీకేజీతో దాదాపు నెలరోజుల నుంచి మంజీరా నీరు వృథాగా పోతోంది. దీనిపై పలువురు అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు చెబుతున్నారు. రోజు వేల లీటర్ల నీరు వృథాగా పోతునప్పటికీ అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని, వెంటనే లీకేజీకి మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

విద్యార్థులకు దాతల సహకారం

షాద్‌నగర్‌రూరల్: విద్యార్థులు దాత ల సహకారాన్ని సద్వినియోగం చేసుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ శరత్‌చంద్రబాబు అన్నారు. బుధవారం లయన్స్ షాద్‌నగర్ సేవా సంకల్ప్ ఆధ్వర్యంలో లయన్స్ సభ్యుడు ఎంవీఎస్.రంగయ్య సహకారంతో మున్సిపల్ పరిధిలోని రాంనగర్ కాలనీ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీ అందజేశారు. అదేవిధంగా మండలంలోని కిషన్‌నగర్ గ్రామ పరిధిలోని వేద పాఠశాల విద్యార్థులకు అన్నదానం, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి సిమెంట్ బల్లలను అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చేగూరి రాజేందర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, రీజియన్ సెక్రటరీ మదన్‌మోహన్‌రెడ్డి, జోన్ చైర్మన్ రాజు, క్లబ్ అధ్యక్షుడు రవికుమార్, సెక్రటరీ విజేందర్ రెడ్డి, సభ్యులు రామకృష్ణారెడ్డి, లక్ష్మీపతిరెడ్డి, అశోక్, శివనాగయ్య పాల్గొన్నారు.

పచ్చని తెలంగాణే లక్ష్యం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



మున్సిపాలిటీలో మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు

చేవెళ్ల: పచ్చని తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వనమహోత్సవ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మున్సిపాలిటీ పరిధి మోడల్ కాలనీలో, మండలంలోని ఆలూరులోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో బుధవారం వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పల్లె, పట్టణం పచ్చదనంతో నిండిపోవాలన్నదే ప్రభుత్వ ఆలోచన అన్నారు. దీనికి ప్రతి ఒక్కరి సహకారం అవసమన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమతుందన్నారు. శాఖల వారీగా అధికారులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. మోడల్ కాలనీలో ఉన్న పార్కు స్థలంలో వన మహోత్సవంలో భాగంగా పెద్ద సంఖ్యలో మియావాకి–కాన్సెప్ట్ ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. నాటిన మొక్కలను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశం, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ హిమబిందు, రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి, టీపీసీసీ నాయకుడు జనార్ధన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ పెంటయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్‌లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాయకులు వసంతం, రవీందర్‌రెడ్డి, ఆగిరెడ్డి, సమత, శైలజ, గోపాల్‌రెడ్డి, నరేందర్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, మల్లేశ్, రాములు, ఆలూరు నర్సింలు, మున్సిపల్ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, వివిధ శాఖ అధికారులు, ఆలూరు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితోనే ఆర్థికాభివృద్ధి

మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య



మహిళకు శిక్షణ పత్రం అందిస్తున్న చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధిస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన స్వయం సహాయక సంఘాల ఉత్పత్తి మేళాను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి చేపట్టిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు ఆయా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పలు విభాగాల్లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. మేళాలో భాగంగా మహిళా సంఘాల సభ్యులు తయారు చేసిన తినుబండారాలు, కుట్లు, అల్లికలతో పాటు పలు ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం కుట్టు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు జనశిక్షణ సంస్థాన్ జిల్లా సభ్యుల ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ శిక్షణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ బాలాజీ, కౌన్సిలర్లు మాదారం నర్సింలుగౌడ్, సోమ్లానాయక్, నాయకులు సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌యాదవ్, మెప్మా జిల్లా కో–ఆర్డినేటర్ అశోక్, పట్టణ కో–ఆర్డినేటర్ లక్ష్మీ, సంస్థ ప్రతినిధి గీత, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను మెరుగుపరుచుకోవాలి

ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత

చేవెళ్ల: విద్యార్థులు ప్రొఫెషనల్ కోర్సుల్లో రాణిస్తూ సృజనాత్మకతను మెరుగుపరుచుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంచనలత అన్నారు. చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నాక్), స్పేస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్మాణం, ఫిల్మ్, మీడియా, ఎంటర్‌టైన్‌మెంట్ రంగాల కోర్సులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాక్ అసిస్టెంట్ డైరెక్టర్ అంజయ్య, ప్రసాద్, స్పేస్ అకాడమీ ప్రతినిధులు శాస్త్రీ, స్వప్నలు మాట్లాడుతూ.. నిర్మాణ రంగంలో నైపుణ్యాల అవసరాన్ని వివరించారు. ఈ కోర్సుల ప్రాముఖ్యతను తెలియజేశారు. విద్యార్థులు ఉపాధి అవకాశాలు ఉన్న కోర్సులను ఎంపిక చేసుకొని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సమన్వయకర్త కవిత, డాక్టర్ ఎం.రమేశ్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక చర్యలు

ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కేశంపేట: గ్రామాల్లో ప్రజలకు ఇబ్బంది కలగకుండా పారిశుద్ధ్య పనుల నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ కిష్టయ్య అన్నారు.బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు మంచి నీటికి ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడూ పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణా ల్లో నాణ్యత పాటించే విధంగా చూడాలన్నారు.వనమహోత్సవంలో నాటేందుకు మొక్కలను సిద్ధంగా ఉంచాలన్నారు.కార్యక్రమంలో ఎపిఓ అజీజ్, రవీందర్‌రెడ్డి, నర్సింలు పాల్గొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లో వీధి కుక్కల నియంత్రణ కార్యక్రమం మొదలుపెట్టారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్‌లో అనిమల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శునకాలను పట్టుకెళ్లారు. వాటికి సంతాన ఉత్పత్తి లేకుండా ఆపరేషన్ చేసి రెండు, మూడు రోజుల పాటు చికిత్స ఇచ్చిన తర్వాత ఇతర అడవి ప్రాంతాల్లో వదిలేస్తామని వారు తెలిపారు. వీధి కుక్కలు గ్రామాల్లో అధికంగా ఉండడంతో అవి ఆకలికి తట్టుకోలేక మనుషులపై వీరంగం సృష్టిస్తున్నాయని, అందులో భాగంగా ప్రభుత్వం సూచించిన మేరకు శునకాల నియంత్రణ కార్యక్రామాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మంజులరవియాదవ్ మాట్లాడుతూ.. హిమాయత్‌నగర్‌లో వీధికుక్కల నుంచి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జగన్

షాద్‌నగర్: విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించి ఉజ్వల భవిష్యత్ పొందాలని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జగన్ అన్నారు. బుధవారం పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో విద్యార్థులకు నాయకత్వ లక్షణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదేవిధంగా సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. వ్యసనాలకు బానిసలు కావొద్దని సూచించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జీపీ భవన నిర్మాణ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న మండల నాయకుడు కృష్ణారెడ్డి

కొందుర్గు: మండలంలోని కొత్త ఆగిర్యాలలో బుధవారం గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవన నిర్మాణానికి ఉపాధిహామీ పథకంలో రూ.20లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఈశ్వర్, భాస్కర్, కృష్ణయ్య, జాకీర్ హుస్సేన్, సాబేర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌రూరల్: బాకారంలో బోనాల ఊరేగింపు



మొయినాబాద్: పెద్దమంగళారంలో పోతురాజుల విన్యాసాలు

బోనం.. ఘనం

చేవెళ్ల నియోజకవర్గంలో బుధవారం ఆషాఢమాస బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రజలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా అమ్మవారి ఆలయాలకు చేరుకొని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు తరలిరావడంతో కిక్కిరిసిపోయాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా ఉత్సవాల నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పోలీసుల బందోబస్తు చేపట్టారు.



మొయినాబాద్‌రూరల్: ఊరేగింపులో శివసత్తుల పూనకాలు



షాబాద్: బోనాలు ఊరేగింపు

డిప్యూటేషన్లను వెంటనే రద్దుచేయాలి

ఎంఈఓకు టీఎస్‌యూటీఎఫ్ నాయకుల వినతి



ఎంఈఓ మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో గల ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను వెంటనే రద్దుచేయాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈఓ మనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తూ తమ నివాస ప్రాంతాలకు దగ్గర ఉన్న పాఠశాలలకు డిప్యూటేషన్లపై వెళ్తున్నారన్నారు. దీంతో ఇక్కడి పాఠశాలల్లోని విద్యార్థులకు సరైన విద్య అందకపోవడంతో వారికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఇక్కడి నుంచి వెళ్తున్న ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మండల పరిధిలోని వెల్జర్ల ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు భౌతికశాస్త్రం ఉపాధ్యాయుల డిప్యూటేషన్ల ఉత్తర్వులను రద్దు చేసి విద్యార్థులకు జరుగుతున్న నష్టాన్ని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తికి తగిన విధంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ నాయకులు నర్సింలు, వెంకటయ్య, రసూల్, బాలయ్య, సత్యం, కృష్ణ, మహేష్, లక్ష్మీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట: మండల పరిధిలోని సంగెంలో బుధవారం పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జగదీశ్వర్, యాదయ్యయాదవ్, శ్రీధర్ రెడ్డి, పల్లె అనంద్‌కుమార్, సురేష్‌రెడ్డి, గిరియాదవ్, ఇబ్రహీం, వినయ్‌రెడ్డి, సురేష్, జర్నలిస్టు రాఘవేందర్‌గౌడ్, గుండె రాణి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రబాబు



బాలింతకు వైద్యం చేస్తున్న డాక్టర్ నాగేంద్రబాబు

షాబాద్: ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్రబాబు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డెలివరీ కేసులు ఎన్ని వస్తున్నాయని సిబ్బందిని అడిగి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు. సమయపాలన పాటించాలని, లేనిచో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రిలో ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యసేవలు అందించాలని సూచించారు. ప్రైవేట్ దీటుగా పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. వివిధ రకాల వ్యాధులతో ఆస్పత్రికి వచ్చిన ఏ ఒక్క రోగి కూడా నిరుత్సాహంతో వెనక్కి వెళ్లకుండా తప్పనిసరిగా వైద్యం చేసి పంపించాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ శ్యామ్ రావు, వైద్య సిబ్బంది సౌజన్య, మంజుల, శ్రీధర్ తదితరులు ఉన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధితో లాభాలు

పశువైద్య విశ్వవిద్యాలయం మాజీ రిజిస్టర్ కొండల్‌రెడ్డి



మాట్లాడుతున్న కొండల్‌రెడ్డి

షాబాద్: రైతులు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుంటే మంచి లాభాలు వస్తాయని పశువైద్య విశ్వవిద్యాలయం మాజీ రిజిస్టర్ కొండల్‌రెడ్డి, సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బొబ్బిలిగామలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్ పీవీ నర్సింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో జిల్లా శాస్త్రీయ పద్ధతుల డెయిరీ సాగు, పాల ఉత్పత్తుల విలువల జోడింపుపై రైతులకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు శాస్త్రీయ పద్ధతిలో పాడి పశువుల పెంపకం, పాల పదార్థాల తయారీపై పాడి రైతులకు అవగాహన కల్పించారు. సేవా స్ఫూర్తి ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ.. డెయిరీ రంగంలో గ్రామీణ మహిళల సాధికారత అనే అంశంపై పాడి రైతులకు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం పాల ఉత్పత్తుల తయారీపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు చంద్రారెడ్డి, యాదవరెడ్డి, చెన్నయ్య, మహిళా పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు, గ్రామస్తులు

చేవెళ్ల: దేవాలయాల అభివృద్ధికి దాతలు ముందుకురావడం అభినందనీయమని బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని పోచమ్మ ఆలయం చుట్టూ పట్టణానికి చెందిన దాతలు పెంజర్ల అనంత్‌రెడ్డి, నర్సింహారెడ్డి సొంత నిధులతో సీసీరోడ్డు వేయించడానికి ముందుకొచ్చారు. ఈ పనులను బుధవారం స్థానికులతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బోనాలతో మహిళలు ఆలయం చుట్టూ తిరిగేందుకు రోడ్డు లేకపోవటంతో స్వచ్ఛందంగా దాతలు ముందుకురావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా దాతలను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఒక్కరూ ఆలయాల అభివృద్ధికి సహకరించాలన్నారు. బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు పాండురంగారెడ్డి, యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, గ్రామస్తులు రాంరెడ్డి, రాజు, కృష్ణారెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, జయసింహా, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

మాజీ ఎమ్మెల్యే నర్సింహులు



లక్ష్మయ్య దంపతులను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు, ఉపాధ్యాయులు

కొందుర్గు: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్ద ఎల్కిచర్ల పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయుడు ఎర్ర లక్ష్మయ్య పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. ఆయన శేషజీవితం ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. అనంతరం లక్ష్మయ్య దంపతులను ఆయన, పలువురు నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, గౌరవాధ్యక్షుడు రాఘవేందర్, ఉపాధ్యాయులు సురేష్‌రెడ్డి, శ్రీనివాసురెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐటీ ర్యాంకర్‌కు సన్మానం



వైష్ణవిని సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్ నగర్ గ్రామానికి చెందిన పాండు, శివలీల దంపతుల కూతురు వైష్ణవి ఐఐటీ ఫలితాల్లో మంచి ర్యాంక్ సాధించింది. ఈ సందర్భంగా బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, అందె బాబయ్య గ్రామానికి చేరుకొని వైష్ణవిని శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఆడపిల్ల చదువు అవనికి వెలుగు అని, కృషి, పట్టుదలతో చదివితే విజయం మీ బానిస అవుతుందన్నారు. ప్రధాని మోదీ కలలుగన్న భేటీ బచావో, భేటీ పడావో స్ఫూర్తితో అమ్మాయిలు ఉన్నత స్థాయిలో స్థిరపడాలని సూచించారు. భవిష్యత్‌లో పైచదువులను అభ్యసించి ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, సుధాకర్‌అప్ప, లక్ష్మీకాంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, నర్సింలు, ఆంజనేయులు, వెంకటేశ్, వంశీకృష్ణ, సురేష్, శివశంకర్, కృష్ణ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.